క్లుప్తంగా

కన్నులపండువగా వెంకన్న కల్యాణం

అంబాజీపేట: శ్రీనివాసా గోవిందా.. శ్రీ వెంకటేశా గోవిందాలతో నామస్మరణల మధ్య వెంకన్న కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యుల బ్రహ్మత్వంలో స్వామి వారి కల్యాణం, వేద మంత్రోచ్ఛారణ నడుమ, మంగళ వాయిద్యాలతో, గోవింద నామస్మరణతో వెంకన్న కల్యాణం కన్నుల వైకుంఠంగా సాగింది. వందలాది మంది మహిళలు స్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణం వద్ద స్వామి వారి తీర్థం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు, స్థానిక యువకుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టనున్నారు. అలాగే తీర్థంలో గారడీ నృత్యాలు, మ్యూజికల్ నైట్‌తో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరపనున్నారు.

నేడు ర్యాలి సత్యనారాయణ స్వామి కల్యాణం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలిలో వేంచేసిన రమా సత్యనారాయణస్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి వారి దేవస్థానంలో ఉపాలయమైన రమా సత్యనారాయణ స్వామి వారికి ఏటా వైశాఖశుద్ధ ఏకాదశి నాడు వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు నిర్వహించడంలో భాగంగా ఈ నెల 8 నుంచి 13 తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. అలాగే ర్యాలి గ్రామంలో వేంచేసిన ఉమా కమండలేశ్వర స్వామి వారి వార్షిక దివ్య కల్యాణోత్సవాలు ఈ నెల 8 నుంచి 12 వరకూ జరుగుతాయని ఆ దేవస్థానం ఈఓ తెలిపారు.

నేడు వీరేశ్వరస్వామి వారి కల్యాణం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో వేంచేసిన ఉమాపార్వతీ సమేత వీరేశ్వర స్వామి, శ్రీ, భూ సమేత కేశవస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని గురువారం రాత్రి నిర్వహించనున్నట్లు దేవాలయ అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్, సుదర్శనం కేశవాచార్యులు, భక్త బృందం తెలిపారు. స్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా త్రిశూల చక్రస్నానం, నాగవల్లి, వైశాఖ పూజలు చేయనున్నామన్నారు. అదే రోజున ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధ చేపట్టనున్నామన్నారు.

విప్లవ వీరుడు సీతారామరాజు



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బుజ్జిరాజు తదితరులు

సఖినేటిపల్లి: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నత వ్యక్తి, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు అన్నారు. బుధవారం సఖినేటిపల్లి క్షత్రియ కల్యాణ మండపం ఆవరణలో అయన విగ్రహం వద్ద వర్ధంతి పురస్కరించుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బుజ్జిరాజు మాట్లాడుతూ, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేస్తూ వీరోచితంగా త్రివిధ దళాలు తగిన గుణపాఠం చెప్పడం హర్షణీయమని అన్నారు. రుద్రరాజు రంగరాజు, ఇందుకూరి రమేష్‌రాజు, ఆర్.రామరాజు, ఇందుకూరి వెంకటపతిరాజు, సుబ్బరాజు పాల్గొన్నారు.

రావులపాలెం/కొత్తపేట: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ముగింపు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శత వర్ధంతి ముగింపు కార్యక్రమాలను నిర్వహించినట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి దుళ్ళ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సఖినేటి వాకులరాజు, పెన్మెత్స సోమరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలివెలలోనూ అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి దుళ్ల నివాళులర్పించారు.

సంస్కరణల పితామహుడు సంజీవయ్య

సఖినేటిపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సంస్కరణల పితామహుడిగా ఖ్యాతి గడించారని రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజు అన్నారు. బుధవారం మోరి మహిమా కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో సంజీవయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టాండన్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమాఖ్య అధ్యక్షుడు గెద్దం ప్రభాకర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టాండన్‌రాజు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సంస్కరణల్లో భాగంగా దేశంలోనే తొలిసారి వృద్ధాప్య పింఛన్లను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సమాఖ్య సభ్యులు చింతా శేషు, గొల్ల సుభాకర్‌రెడ్డి, తోట జాన్‌బాబు, గెద్దం బాలరాజు, నానాజీ, తాడి ఆనందరావు, నల్లి సత్యం, తాడి సత్యనారాయణ, మేడిద ఏసయ్య, తరపట్ల రవికుమార్ పాల్గొన్నారు.

రిలే దీక్షలకు తరలిన నేతలు



అమలాపురంలో జరిగిన వైఎస్సార్ సీపీ రైతు రిలే దీక్షలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పాల్గొన్న కొత్తపేట నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు



అమలాపురంలో జరిగిన వైఎస్సార్ సీపీ రైతు రిలే దీక్షలో నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో పాల్గొన్న రాజోలు నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు



అమలాపురంలో జరిగిన వైఎస్సార్ సీపీ రైతు రిలే దీక్షలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

పెంట కాలువలు

- అధ్వాన స్థితిలో పంట కాలువలు
- ఆధునీకరించాలని డిమాండ్

మామిడికుదురు: పంట కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. పలు చోట్ల పంట కాలువలు పూడుకుపోయి సాగునీటి పారుదలకు ఆటంకంగా మారాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల రిటైనింగ్ వాల్స్ నిర్మించాల్సి ఉంది. మరికొన్ని చోట్ల పూడిక తొలగించాల్సి ఉంది. ఈ వేసవిలో అయినా కాలువల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంట కాలువల్లో ఏర్పాటు చేసిన డ్రైన్లను సైతం తొలగించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. నీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ దిశగా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

తాత్కాలిక మరమ్మతులు..

మామిడికుదురు గ్రామంలోని కొర్లగుంట నుంచి లూటుకుర్రు వెళ్లే చానల్ పరిధిలో డ్రైన్ వద్ద పంట కాలువగట్టు పాడైపోయింది. ఇక్కడ తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. సర్వే కర్రలు పాతి, ఇసుక బస్తాలు వేసి సాగునీరు డ్రైన్‌లోకి వృథాగా పోకుండా ఇటీవల తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఈ చర్యలతో సమస్య తాత్కాలికంగా పరిష్కారం అయింది. కానీ ఇక్కడ పక్కాగా రక్షణ గోడ నిర్మించాల్సి ఉంది. మానేపల్లి చానల్ పరిధిలో నాగుల్లంక నుంచి మామిడికుదురు వరకు పలు చోట్ల డ్రైన్ తూరలను కాలువలోకి ఏర్పాటు చేశారు. ఈ కాలువ ద్వారా సరఫరా అవుతున్న నీరు పాశర్లపూడిలోని ప్రధాన తాగునీటి ప్రాజెక్టుకు సరఫరా అవుతుంది. డ్రైనేజ్ తూరపై దీనిపై దృష్టి సారించి వాటిని తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



మామిడికుదురులో కాలువకు తాత్కాలికంగా చేపట్టిన రక్షణ చర్యలు

కాలువలను బాగు చేయాలి



పంట కాలువల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. పంట కాలువలు డ్రైన్లను తలపిస్తున్నాయి. డ్రైనేజ్ తూరలను విచ్చలవిడిగా కాలువల్లోకి ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు సీసాలను కాలువల్లో పడేస్తున్నారు. వీటిపై నీటి సంఘం ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ వేసవి సీజన్‌లో అయినా కాలువలను బాగు చేయించి, సక్రమంగా సాగునీరు అందించాలా చర్యలు తీసుకోవాలి.

– పినిశెట్టి నాగబాబు, రైతు, మామిడికుదురు

రిటైనింగ్ వాల్స్ నిర్మించండి



మామిడికుదురు కాలువ పరిస్థితి దారుణంగా ఉంది. కొర్లగుంట నుంచి సెంటర్‌కు వెళ్లే చోట కాలువ గట్టు పాడైపోయి కాలువ నీరు వృథాగా డ్రైన్‌లోకి పోతుంది. దీనిని అరికట్టే దిశగా చర్యలు తీసుకోవాలి. కాలువ గట్టుకు రక్షణ గోడ నిర్మించాలి. వృథాగా నీరు పోకుండా తగిన చర్యలు తీసుకోవాలి. నీటిని విడుదల చేసే టైమ్ దగ్గర్లో కాకుండా ఇప్పటి నుంచి అధికారులు కాలువలను బాగు చేయించాలి. దీనిపై వెంటనే దృష్టి సారించాల్సి ఉంది.

– వానరాశి ఏడుకొండలు, రైతు, పెదపట్నం

ప్రతిపాదనలు పంపించాం

కాలువలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాం. వాటిని ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే పనులు మొదలు పెడతాం. ఇప్పటికే కడలి, మానేపల్లి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాం. వీటికి రూ.17 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు నిర్వహిస్తున్నాం. మిగిలిన పనులకు కూడా రెండ్రోజుల్లో నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది. ఈ పనులు కూడా త్వరలోనే చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– సుందర్‌సింగ్, ఇరిగేషన్ ఏఈ, తాటిపాక

ఎంపీడీఓగా భీమారావు



అంబాజీపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఎంపీడీఓగా జి.భీమారావు ఉద్యోగ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. అయినవిల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం అయన అంబాజీపేట ఈవోపీఆర్డీగా కొనసాగుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ జీవీ సరోవర్ అయినవిల్లి ఎంపీడీఓగా పదోన్నతిపై వెళ్లారు.

ప్రతి ఇంటినీ సర్వే చేయాలి

అంబాజీపేట: మండలంలో ప్రతి ఇంటినీ సర్వే చేసి నివాసంలో ఉంటున్న వారి వివరాలతో పాటు డిసీజ్‌లను పూర్తి స్థాయిలో గుర్తించాలని డీపీఎంఓ టీవీకే శ్రీనివాసరావు అన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్థానిక, ముక్కామల పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అన్ని పథకాలను రోగులకు వివరించి వాటిని అందేలా చూడాలన్నారు. పీహెచ్‌సీల ద్వారా అందుతున్న సేవలను రోగులకు వివరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలవరీలు అయ్యేలా గర్భిణులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కేఎస్ శ్రీనివాస్, సూర్యనగేష్ పాల్గొన్నారు.

సింహాచలం మృతుల కుటుంబాలకు పరామర్శ



స్వామినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగ్గిరెడ్డి, శ్రీనివాసరావు

అంబాజీపేట: సింహాచలం సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో మృతి చెందిన వారి కుటుంబాలను బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. కొర్లపాటివారిపాలేనికి చెందిన పత్తి దుర్గా స్వామి నాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషరావు కుటుంబ సభ్యులను పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావులు బుధవారం పరామర్శించారు. ఆ యువకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. సింహచలం ఘటనలో ఐదుగురు మంత్రులను బర్తరఫ్ చేయాలని, చిన్నచిన్న చేపలను పట్టుకుని తిమింగలాలను వదిలియేడం చంద్రబాబుకు సిగ్గు చేటన్నారు. ఎటువంటి పిల్లర్లు లేకుండా 70 అడుగుల పొడవున 18 అడుగుల ఎత్తులో అవినీతి నిర్మాణం చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం డబ్బులకు కక్కుర్తిపడి నాణ్యత లేకుండా నిర్మించిన గోడ వల్లే ఎనిమిది మంది నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్నారు. మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం రూ.25 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మృతుల కుటుంబాలకు రూ.75 లక్షలను అందిస్తామని పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని దానిని తప్పకుండా అమలు చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైజాగ్ ఫ్యాక్టరీలో జరిగిన ఘటనలో మృతులకు రూ.కోటి అందించారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, మైలా ఆనందరావు, సూదాబత్తుల రాము, కొర్లపాటి చంటి, నాగాబత్తుల నరసింహమూర్తి పరామర్శించిన వారిలో ఉన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం



పలివెలలో వర్షానికి తడిసిన ధాన్యం

కొత్తపేట: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో అకాల వర్షం పంటను తడిపి ముద్ద చేసింది. బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలో చేనుపై ఉన్న పంట, కోసి మాసూలు చేసి ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయింది. మండలంలో సుమారు 7,500 ఎకరాల్లో రబీ (దాళ్వా) వరి సాగు చేయగా ఇంత వరకు సుమారు 5 వేల ఎకరాల్లో పంట కోసి మాసూళ్లు చేశారు. సుమారు 7 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పీపీసీల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయగా కళ్లాలు, రైతుల వద్ద ఇంకా సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. సుమారు 2,500 ఎకరాల్లో పంట కోయవలసి ఉంది. ఈ నెల 20 నాటికి కోతలు పూర్తి కానున్నాయి. కాగా బుధవారం వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు తమ ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోసుకున్నారు. దాన్ని ఒబ్బిడి చేసుకునేలోపే అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయింది. రాశుల చుట్టూ చేరిన నీరును రైతులు గాడి తీసి పక్కకు మళ్లించుకున్నారు. గురువారం వాతావరణం తెరిపిస్తే రాసిపై కప్పిన బరకాలు తొలగించి ఆరబెట్టుకోవాలని, ఎండ కాయకపోతే పరిస్థితి ఏమిటోనని రైతులు వాపోయారు.

ప్రతి గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ చేపట్టాలి



రావులపాలెం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

రావులపాలెం: ప్రతి గ్రామంలోనూ తడి పొడి చెత్త సేకరణ చేపట్టాలని అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీకర్ ఆదేశించారు. రావులపాలెం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. తడి పొడి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుంది, సేకరించిన చెత్తను ఈ సంపద కేంద్రాల వద్ద ఏ విధంగా వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారనే దానిపై గ్రీన్ అంబాసిడర్లను ప్రశ్నించారు. వర్మీ కంపోస్ట్ మరింత ఉత్పత్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇలా తయారైన వర్మి కంపోస్టు మార్కెటింగ్‌పై ఆరా తీయగా కొనుగోలు దారులు తక్కువగా ఉంటున్నారని ఎంపీడీవో మహేశ్వరరావు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రావులపాలెంలో ఎన్ని వాహనాల ద్వారా ఎంతమంది పారిశుద్ధ్య కార్మికులు తడి పొడి చెత్త సేకరణ చేపడుతున్నారనే వివరాలను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ ఆర్డీఓకు వివరించారు. అలాగే మండలంలో ప్రస్తుతం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి వివరాలు అందజేయాలని డిప్యూటీ ఎంపీడీవో కృష్ణకు సూచించారు.

ఉగ్రవాదాన్ని సమర్థిస్తే ఇంతే..

మలికిపురం: ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ద్వారానే పాకిస్తాన్ సమూలంగా మట్టి కరుస్తుందని, ఉగ్రవాదాన్ని సమర్థిస్తే ఎవరికైనా ఇంతే గతి పడుతుందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస్ నగేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం మలికిపురంలో ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు భారత్ ఆర్మీ గుణపాఠం చెప్పిందన్నారు. పాకిస్తానీ ప్రేరేపిత ఉగ్రవాదులు ఎంతో మంది భారతీయులను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ప్రజా ప్రతినిధులు భారత్‌పై అవాకులు చవాకులు మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణ వద్దు

మలికిపురం: రాష్ట్రంలో 40 డిగ్రీలు దాటి ఎండలు మండిపోతుంటే నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో కూడా ప్రైవేటు విద్యాసంస్థలు తరగతులు నిర్వహించడం దారుణమని సీపీఐ నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సెలవుల్లో కూడా విద్యార్థులకు ఆటవిడుపు లేకుండా, మానసికంగా తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని, విద్యను వ్యాపారంగా మార్చవద్దని, వేసవి సెలవులు అమలయ్యే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులకు రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ డాబా మీద నుంచి కిందకు పడిపోయిన బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చెంపేటకి చెందిన కడిమి దుర్గమ్మ (60) నెల రోజులు క్రితం డాబా మీద నుంచి ప్రమాదవశాత్తూ కింద పడిపోవడంతో హాస్పిటల్‌కి తీసుకువెళ్లి కొంత వరకూ వైద్యం చేయించారు. ఆర్థిక స్తోమత లేక ఇంటికి తీసుకువచ్చేశారు. అప్పటి నుంచి మంచం మీదే ఉంటున్నారు. వైద్యం నిమిత్తం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సంస్థ సభ్యులు బుచ్చెంపేటలో దుర్గమ్మ ఇంటికి వెళ్లి రూ.12 వేల నగదును సాయంగా అందజేశారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



నాగుల్లంకలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పి.గన్నవరం: దోమల నివారణకు ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకు వచ్చేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. నాగుల్లంక పీహెచ్‌సీలో బుధవారం ఆయన వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ జాసిమ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్, ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, పీహెచ్ఎన్ ఎంఎస్ఎస్ కుమారి, ఎంపీహెచ్ఎస్ బీవీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలి



సమావేశంలో నాయకులతో చర్చిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ సంస్థాగత నిర్మాణంపై ప్రధాన దృష్టి పెట్టాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ విభాగాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఖాళీగా వున్న పార్టీ అనుబంధ విభాగాల పదవులని వెంటనే భర్తీ చేయడంతో పాటు పదవులు పొందిన నాయకులు కష్టపడి పని చేయాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం చేయాలని సూచించారు. 27 విభాగాలకుగాను 7 విభాగాలు భర్తీ అయ్యాయని మిగిలినవి కూడా పేర్లు సూచించాలని కేడర్‌కు సూచించారు. గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త పోరాట పటిమ కలిగి ఉండాలన్నారు. ప్రజా సమస్యలతో పాటు పార్టీ కార్యకర్తలపై అధికార పార్టీ వేధింపులని కూడా తిప్పి కొట్టేందుకు సిద్ధంగా వుండాలన్నారు. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. సమావేశంలో పాటి శివ కుమార్, అడబాల వీర బ్రహ్మాజీరావు, కుసుమ చంద్రశేఖర్, ఈద రవిరెడ్డి, గుర్రం జాషువా, కొల్లాబత్తుల సతీష్, కోటిపల్లి ఎస్తేరు రాణి, ఇనుమర్తి నాగరాజు, రంగరాజు, మోకా సురేష్, గుర్రం నాగ వెంకటరాజు, జాలెం జనార్దన్, జిల్లెల్ల ఉదయ్‌కిరణ్, తాడి సహదేవ్, అడబాల జానకి రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి



అంబాజీపేటలో వాసవీ మాతకు 102 రకాల వంటకాలు సమర్పించి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పి.గన్నవరం/అంబాజీపేట/సఖినేటిపల్లి: మానేపల్లిలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు. అంబాజీపేట కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని ఆలయ ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వైశ్య మహిళల ఆధ్వర్యంలో 102 రకాల వంటకాలను అమ్మవారికి నైవేద్యంగా చెల్లించారు. సఖినేటిపల్లిలో కొలువైన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం ఆర్యవైశ్య మహిళలతో సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని 1116 గాజులతో అలంకరణ చేశారు.

సంక్షిప్తంగా..

ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సత్కారం



జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, ఉపాధ్యక్షులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, మాజీ ఎమ్మెల్యే వేమా

పి.గన్నవరం: ఏపీడబ్ల్యూజే జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కొర్లపాటి ప్రదీప్‌కుమార్, గూటం శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు కుడుపూడి గణపతిలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బుధవారం పి.గన్నవరంలో దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇటీవల రామచంద్రాపురంలో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి ఈ ముగ్గురు జర్నలిస్టులు వివిధ పదవులకు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, నాయకులు డీవీవీ సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, చిన్నం బాల విజయారావు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రుని ఆలయంలో ఏకాహం

ఆలమూరు: మండలంలోని చింతలూరు–పెదపళ్ల సెంటర్‌లో వేంచేసిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం ఏకాహం వైభవంగా జరిగింది. వీరబ్రహ్మేంద్రస్వామి వైశాఖ శుద్ధ దశమి రోజున జీవసమాధైన సందర్భాన్ని పురస్కరించుకుని విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు సమారాధన పూజలు నిర్వహించారు. ఈ ఏకాహంలో పడాల నాగు, గిద్దా శ్రీనివాసు, అరవలపల్లి వెంకటేశ్వరరావు, అలుగోజు శ్రీనివాసు బృందాలు ఆలపించిన భజన కీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఆలమూరు: మండలంలోని ఆలమూరు, పినపళ్ల, పెదపళ్ల తదితర గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద జరుగుతున్న పూడికతీత పనులు చేస్తున్న కూలీలకు బుధవారం ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ జరిగింది. ఎంపీడీఓ ఎ.రాజు ఆదేశాల మేరకు ఎండ తీవ్రత, ఉక్కబోత నుంచి ఉపశమనం పొందేందుకు ఫీల్డ్ అసిస్టెంట్ల సహకారంతో వైద్యారోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ద్రావణాన్ని పంపిణీ చేశారు. ఏపీఓ జి.అరుణకుమారి, టెక్నికల్ అసిస్టెంట్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మంచి బుద్ధి ప్రసాదించాలి

అంబాజీపేట: ఇంటలిజెన్స్ చీఫ్‌గా విధులు నిర్వహించిన పీఎస్సార్ ఆంజనేయులుపై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలంటూ అంబాజీపేట మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్థానిక పెద్దవీధిలో ఉన్న వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. సంఘ నాయకులు పేరి శ్రీనివాసరావు, వక్కలంక రాధాకృష్ణలు మాట్లాడుతూ ఆంజనేయులు పై కూటమి ప్రభుత్వం నిరాధారమైన కేసులు నమోదు చేసి వేధిస్తుందన్నారు. కార్యక్రమంలో రావి శ్రీధర్, వడ్లమాని సుందరరావు, యర్రాప్రగడ ప్రసాదరావు, ముష్టి రాజేశ్వరరావు పాల్గొన్నారు.